సాక్షి ప్రకాశం

ఆదివారం | 4 | జూన్ | 2023

I



చినచేపను పెద చేప

పొన్నలూరు మండలంలోని నాగిరెడ్డిపాలెం యానాది జాలర్ల సహకార సంఘంలో భారీగా అవకతవకలు చోటుచేసుకున్నాయి. అవినీతి దందా జరిగింది.

- IIలో..



సచివాలయాలతో జగనన్న కల సాకారం

వలంటీర్లు, సచివాలయాల ద్వారా అర్హులందరికీ పథకాలు అందిస్తూ జగనన్న కల సాకారమైందని ఎమ్మెల్యే టీజేఆర్ అన్నారు.

- 9లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 43 /32

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటీరెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలులు వీస్తాయి

న్యూస్‌రీల్

జెడ్పీలో 126 మంది బదిలీ

ఒంగోలు: జిల్లా పరిషత్‌లో 126 మందిని బదిలీ చేస్తూ సీఈవో బి.జాలిరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆదేశాలతో 11 మంది అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, 16 మంది సీనియర్ అసిస్టెంట్లు, 24 మంది జూనియర్ అసిస్టెంట్లు, 24 మంది రికార్డు అసిస్టెంట్లు, 13 మంది టైపిస్టులు, 35 మంది ఆఫీస్ సబార్డినేట్లను బదిలీ చేశారు. పొన్నలూరు మండలం నుంచి పి.రత్నజ్యోతిని టంగుటూరుకు, చీమకుర్తి మండలం నుంచి బీజే వండర్‌మన్‌ను సంతనూతలపాడుకు ఎంపీడీవోలుగా బదిలీ చేశారు. నెల్లూరు జిల్లా నుంచి పదోన్నతిపై ఈవోఆర్డీగా బదిలీపై వచ్చిన కె.జలజాక్షిని జరుగుమల్లి మండలం ఎంపీడీవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బాలకార్మికుల కోసం సర్వే



తనిఖీలు చేస్తున్న కార్మికశాఖ అధికారులు, పోలీసులు

ఒంగోలు: బాలకార్మికుల కోసం ఒంగోలు నగరంలో కార్మికశాఖ, పోలీసుశాఖల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు బాలకార్మికుల గుర్తింపు కోసం ప్రత్యేక తనిఖీలను కార్మికశాఖ అధికారులు ప్రారంభించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులైన కార్మికశాఖ సహాయ కమిషనర్లు బి.అనితవాణి, ఎం.ఎలిజబెత్, డీసీపీవోలు దినేష్‌కుమార్, దిశ పోలీసు సిబ్బంది, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, ఎన్‌జీవో సార్డ్స్ ప్రతినిధులు కలిసి బండ్లమిట్ట, గాంధీరోడ్డు, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు బాలలు పనిచేస్తున్నట్లు గుర్తించారు. సంబంధిత దుకాణ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉపకార్మిక కమిషనర్ ఎస్.శ్రీనివాసకుమార్ తెలిపారు. తనిఖీల్లో గుర్తించిన బాలకార్మికులను బాలల సంరక్షణ కమిటీకి అప్పగించారు.

హనుమంత వాహనంపై నరసింహుడు

సింగరాయకొండ(టంగుటూరు): పాత సింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి చప్పరసేవ, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు, ఈఓ పి.కృష్ణవేణి పర్యవేక్షించారు.

గుండె బరువెక్కి...

'చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు.. తీవ్రంగా గాయపడిన ప్రయాణికులు.. రక్తపు మడుగులా తయారై భయానకంగా మారిన ప్రమాద స్థలిని చూస్తే గుండె బరువెక్కుతోంది. ఈ ఘోర ప్రమాదం సంభవించిన రైల్లో తామూ ప్రయాణించామన్న విషయం తలుచుకుంటేనే భయమేస్తోంది. అప్పటి వరకూ తమతో కలిసి ప్రయాణం చేసిన వారు మృత్యువాత పడటం తీవ్రంగా కలచివేస్తోంది.' అంటూ యశ్వంతపూర్– హౌరా ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించిన ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి ఈ రైలులో సుమారు 30 మంది ప్రయాణికులు ఎక్కగా.. అందులో ఆరుగురు మాత్రమే ప్రమాదం సంభవించినప్పుడు రైలులో ఉన్నారు. వారు కూడా క్షేమంగా ఉన్నారని తెలుసుకుని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పలు రైల్వేస్టేషన్లలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు.



ఒడిశాలోని బహనాగ బజార్ రైల్వేస్టేషన్‌లోని ప్రమాద దృశ్యం

- రైల్లో ప్రయాణించిన ప్రయాణికుల ఆవేదన
- టీవీల్లో భయానక దృశ్యాలు చూస్తూ చలించి
- ఉమ్మడి ప్రకాశం నుంచి యశ్వంతపూర్ రైలు ఎక్కిన 30 మంది
- ప్రమాదానికి ముందే వివిధ స్టేషన్లలో దిగిన 24 మంది
- ప్రమాద సమయంలో ఆరుగురు చీరాల వస్త్ర వ్యాపారులు
- వారూ క్షేమం.. ఊపిరి పీల్చుకున్న కుటుంబ సభ్యులు
- ఘోర కలిని తెలుసుకుని ఖిన్నులైన బంధువులు, స్నేహితులు
- ఉలిక్కిపడిన ఒంగోలు.. నిర్మానుష్యంగా రైల్వేస్టేషన్
- పలు రైల్వేస్టేషన్లలో హెల్ప్ డెస్క్‌లు

ఒంగోలు టౌన్:

ఒడిశాలోని బాలేశ్వర్ సమీపంలోని బహనాగ్‌బజార్ వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదం వార్త విన్న ఒంగోలు వాసులు ఉలిక్కిపడ్డారు. గురువారం ఒంగోలు మీదుగా హౌరా వెళ్లిన యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి సుమారు 30 మంది ప్రయాణికులు ఎక్కారు. ఒంగోలులో 12 మంది, చీరాలలో మరో 18 మంది ఎక్కారు. జనరల్ బోగీలో ఎంతమంది ప్రయాణికులు ప్రయాణించారన్నది తెలియదు. వీరిలో ఏడుగురు ప్రయాణికులు వైజాగ్‌లో, 12 మంది విజయనగరంలో, ముగ్గురు పలాసలో దిగిపోయారు. అలాగే ఒకరు విజయవాడ, మరొకరు మచిలీపట్నంలో దిగినట్లు సమాచారం. వీరు కాకుండా చీరాల పట్టణానికి చెందిన ఆరుగురు వస్త్ర వ్యాపారులు రైలులోనే ప్రయాణించారు.



ఒంగోలులో హెల్ప్‌డెస్క్

ఈ రైలులో ప్రయాణించిన వారితో సాక్షి మాట్లాడింది. యశ్వంత్‌పూర్ రైలు ప్రమాదానికి గురైనట్లు తెలిసి ఆందోళనకు గురయ్యామని తెలిపారు. విశాఖపట్నం నార్త్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తమ్ముడు గంటా చిరంజీవి కుటుంబ సభ్యులతో కలిసి ఈ రైలులో ప్రయాణం చేసిన వారిలో ఉన్నారు. ఆయన జరుగుమల్లి మండలం కామేపల్లిలో వ్యవసాయం చేస్తుంటారు. కూతురు వినితకు ఏపీపీఎస్సీ మెయిన్ పరీక్షలు జరుగుతుండడంతో భార్య విజయలక్ష్మితో కలిసి వైజాగ్ వెళ్లారు. తాను ప్రయాణం చేసిన యశ్వంత్‌పూర్ రైలు ప్రమాదానికి గురి కావడం కలిచివేసిందని ఆయన అన్నారు. కామేపల్లికి చెందిన తక్కెళ్లపాటి పద్మ అనే మహిళ వైజాగ్‌లో నివాసముంటున్న కూతురు, అల్లుడు వద్ద ఉంటున్నారు. ఇటీవల ఆమె జరుగుమల్లి మండలం కామేపల్లి వచ్చారు. నాలుగు రోజులు ఉండి ఆమె కూతురు వద్దకు తిరుగు ప్రయాణమయ్యారు. అయితే ఒంగోలు రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఆమెకు రైలు రావడం ఆలస్యమవుతుందని తెలిసింది. సాయంత్రం 7.46 గంటలకు రావాల్సిన రైలు 4 గంటలు ఆలస్యంగా రాత్రి 11.30కి వచ్చింది. దీంతో అలసిపోయిన ఆమె రైలు ఎక్కగానే నిద్రలోకి జారుకున్నారు. మరుసటి రోజు శుక్రవారం సాయంత్రం యశ్వంత్‌పూర్ రైలు పట్టాలు తప్పిందని, వందల మంది అశువులుబాశారని తెలిసి గుండెల్లో రాయి పడ్డట్టయిందన్నారు పద్మ. టీవీలో యాక్సిడెంట్ దృశ్యాలు చూస్తుంటే గుండెలు తరుక్కుపోతోందని వాపోయారు. అప్పటి వరకు తమతో కలసి ప్రయాణించిన వారిలో చాలా మంది మృత్యువాత పడడం జీర్ణించుకోలేకపోతున్నామన్నారు.

నాగులుప్పలపాడు మండలం టి.అగ్రహారానికి చెందిన జాగర్లమూడి వెంకటేశ్వర్లు వైజాగ్‌లో ఓ వివాహానికి హాజరయ్యేందుకు భార్య అమ్మనితో కలిసి యశ్వంతపూర్ రైలులో బయలుదేరి వెళ్లారు. ఒడిశాలో రైలు ప్రమాదం జరిగినట్లు తెలిసి ఖిన్నుడయ్యారు. స్వగ్రామం నుంచి బంధువులు, స్నేహితులు ఫోన్లు చేస్తున్నారని, అయితే తాము సురక్షితంగా ఉన్నామని తెలియజేశామని చెప్పారు.

నిర్మానుష్యంగా ఒంగోలు రైల్వేస్టేషన్...

ఒడిశా రైలు ప్రమాదం నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. దీంతో ఒంగోలు మీద నుంచి హౌరా వైపు వెళ్లే రైళ్లన్నీ రద్దయ్యాయి. ప్రయాణికులు వారి ప్రయాణాలను రద్దు చేసుకున్నారు. ఇదిలా ఉండగా ప్రతిరోజూ ఒంగోలు నుంచి సుమారు వందకుపైగా రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. ఢిల్లీ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అస్సాం, జమ్ము కశ్మీర్‌తో పాటుగా మొత్తం పది రాష్ట్రాలకు ఇక్కడి నుంచి రైలు సౌకర్యం ఉంది. ప్రతిరోజు వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఎప్పుడు చూసినా ప్రయాణికులతో రద్దీగా కనిపించే ఒంగోలు రైల్వేస్టేషన్ నిర్మానుష్యంగా కనిపించింది. ఇదిలా ఉండగా షాలీమార్ నుంచి చెన్నై బయలుదేరిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలుకు చెందిన ఇద్దరు ప్రయాణికులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో ఇప్పటి దాకా రైల్వే పోలీసులకుగానీ, రైల్వే అధికారులకుగానీ ఎలాంటి సమాచారం లేదు. ఒంగోలులో కోరమాండల్ రైలుకు స్టాపింగ్ లేదని అధికారులు తెలిపారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఒంగోలు రైల్వేస్టేషన్‌తో పాటు గిద్దలూరు, యర్రగొండపాలెం, ఇంకా పలు రైల్వేస్టేషన్లలో అధికారులు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు.



అందరూ క్షేమం...



చీరాల ప్రయాణికులు తమ సెల్‌ఫోన్‌తో తీసిన ప్రమాదానికి గురైన రైలు

- హౌరా ఎక్స్‌ప్రెస్‌లో చీరాల నుంచి 18 మంది ప్రయాణికులు
- విజయనగరానికి 12 మంది, హౌరాకు ఆరుగురు
- అందరం క్షేమంగా ఉన్నామంటూ కుటుంబ సభ్యులకు సమాచారం
- ఊపిరి పీల్చుకున్న చీరాల వాసులు

చీరాల అర్బన్: ఒడిశాలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రైలు ప్రమాదంలో చీరాల ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. చీరాల నుంచి హౌరా ఎక్స్‌ప్రెస్‌లో 18 మంది వెళ్లడంతో ప్రమాదం విషయం తెలుసుకుని వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. తమ వారికి ఏమైందోనని భయాందోళనతో వారికి ఫోన్ చేయగా.. అందరూ క్షేమంగా ఉన్నామంటూ సమాచారం అందగా ఊపిరిపీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే... యశ్వంతపూర్ నుంచి హౌరా వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో గురువారం రాత్రి చీరాల నుంచి 18 మంది ప్రయాణికులు వెళ్లారు. వీరిలో 12 మంది విజయనగరానికి చెందిన వారు. చీరాలలో జరిగిన ఓ వివాహ వేడుకకు వచ్చి తిరుగు ప్రయాణంలో చీరాల నుంచి విజయనగరానికి రిజర్వేషన్ చేయించుకున్నారు. అలాగే, చీరాల బెస్తపాలెంకు చెందిన ఆరుగురు రెడీమెడ్ వస్త్రాల షాపు యజమానులు రెడీమెడ్ వస్త్రాలు కొనుగోలు చేసేందుకు కోల్‌కతా వెళ్లేందుకు హౌరా వరకు రిజర్వేషన్ చేయించుకున్నారు. గురువారం సాయంత్రం 8.30 గంటలకు రావాల్సిన రైలు అర్ధరాత్రి 12.30 తర్వాత చీరాల చేరుకుంది. రైలు ఎక్కిన వారిలో 12 మంది విజయనగరంలో దిగారు. అలానే మిగిలిన ఆరుగురు వస్త్ర వ్యాపారులు షేక్ అజారుద్దీన్, షేక్ ఆలీ, షేక్ బాషా, షేక్ ఆహాబీ, నారాయణ, ఎం.రాజేష్. వీరిలో బీ1లో ఇద్దరు, ఎం1లో నలుగురు ఎక్కారు. వీరు ప్రయాణిస్తున్న యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు బాలాసోర్ సమీపంలో బహనాగా బజార్ రైల్వేస్టేషన్ వద్ద ప్రమాదానికి గురైంది. రైలు వెనుక బోగీలలో ఉన్న చీరాలకు చెందిన ఆరుగురు ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు. కోరమాండల్, యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రమాదానికి గురయ్యాయని తెలియడంతో ప్రయాణికుల బంధువులు భయాందోళన చెందారు. తమ వారు ఎలా ఉన్నారోనని వారి సెల్‌ఫోన్లను సంప్రదించగా సిగ్నల్స్ పనిచేయలేదు. కొంతసేపటికి వారే ఫోన్ చేసి తామంతా క్షేమంగా ఉన్నామని చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అలానే చీరాల నుంచి ఆరుగురు హౌరాకు రిజర్వేషన్ చేయించుకున్నారని తెలియడంతో రైల్వే పోలీసులు, జీఆర్పీ పోలీసులు కూడా రిజర్వేషన్ చార్టు ఆధారంగా గుర్తించి వారి అడ్రస్‌లకు వెళ్లి విచారించారు.

ఒక్కసారిగా పెద్దశబ్దం వచ్చింది...

చీరాలలో రెడీమెడ్ వస్త్ర దుకాణాలు నిర్వహిస్తున్న ఆరుగురం వస్త్రాలు కొనుగోలు చేసేందుకు గురువారం రాత్రి యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో కోల్‌కతా బయలుదేరాం. శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చి రైలు కుదుపునకు గురైంది. రైల్వే ట్రాక్ పక్కన ఉన్న రాళ్లు బలంగా అద్దాలకు తగిలాయి. ఏం జరిగిందోనని భయాందోళనకు గురయ్యాం. బయటకు వచ్చి చూసేసరికి రైల్వే ట్రాక్ పక్కన రైలు బోగీలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ప్రయాణికుల హాహాకారాలు మిన్నంటాయి. అదృష్టవశాత్తూ మేము ప్రయాణిస్తున్న బోగీలకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. రాత్రి కావడంతో చిమ్మచీకట్లో సామాన్లు తీసుకుని కొంత సమయం అక్కడే ఉన్నాం. ఏం చేయాలో పాలుపోక రాత్రి 9 గంటల వరకు అక్కడే ఉన్నాం. చెల్లాచెదురుగా పడి ఉన్న బోగీలు, మృతదేహాలు, క్షతగాత్రులను చూసి ఒకింత భయమేసింది. ఎవరిని అడగాలి.. ఎవరితో మాట్లాడాలో తెలియలేదు. బతుకుజీవుడా అంటూ కొంత దూరం నడుచుకుంటూ వచ్చి సమీపంలో ఉన్న హైవే వద్దకు చేరుకున్నాం. కోల్‌కతా వెళ్లేందుకు అక్కడి వారితో మాట్లాడి మూడు బస్సులు ఎక్కి శనివారం ఉదయం 7 గంటలకు కోల్‌కతా చేరుకున్నాం. సెల్‌ఫోన్ సిగ్నల్స్ కూడా తక్కువగా ఉండడంతో మా కుటుంబ సభ్యులకు కూడా క్షేమ సమాచారం చెప్పలేని పరిస్థితి. కోల్‌కతాకు క్షేమంగా చేరుకున్న తర్వాత సమాచారాన్ని చేరవేశాం. ఘోర రైలు ప్రమాదాన్ని ఇలా ప్రత్యక్షంగా చూసి క్షేమంగా బయటపడడంతో దేవుణ్ణి తలుచుకున్నాం. అంతా బాగుంటే ఆదివారం తిరుగు ప్రయాణం కావాల్సి ఉంది. అనుకోని విధంగా రైలు ప్రమాదానికి గురవడంతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చీరాల చేరుకునేందుకు ప్రయత్నిస్తున్నాం.



క్షేమంగా కోల్‌కతా చేరుకున్న చీరాలకు చెందిన ఆరుగురు ప్రయాణికులు

నేడు మద్దిపాడులో మెగా ఉద్యోగ మేళా



మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, ఎస్‌డీ అండ్‌టీ డిపార్ట్‌మెంట్, సీడెప్ (ఎస్ఈఈడీఏపీ), ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్తంగా మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నాయి. మెగా మేళాకు అర్హులైన ఉద్యోగార్థులు దరఖాస్తు చేసుకుని ఇంటర్వ్యూలలో పాల్గొనాలని పలు కంపెనీలు ఆఫర్ చేస్తున్నాయి.

కంపెనీలు, పోస్టుల అర్హతల వివరాలు ఇలా..

- ఎఫ్ట్రోనిక్ సిస్టమ్స్‌లో ఇంజినీయర్ టెక్నికల్ సపోర్ట్, సొల్యూషన్స్ సపోర్ట్ పోస్టులు 75 ఉన్నాయి. డిప్లొమా బీటెక్ (సీఎస్ఈ,ఐటీ, ఈఈఈ,ఈసీఈ, ఈఐఈ), బీఎస్సీ కంప్యూటర్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ 2019–23 పాస్ అవుట్‌లు అర్హులు, 27 ఏళ్లలోపు, దేశ వ్యాప్తంగా ఎక్కడికైనా వెళ్లే పురుషులు మాత్రమే అర్హులు.
- టెక్ మహీంద్రలో కస్టమర్ అసోసియేట్ (వాయిస్ ప్రాసెస్ నాన్‌టెక్నికల్) పోస్టులు 60 ఉన్నాయి. ఇంటర్, ఏదైనా డిగ్రీ కలిగి ఇంగ్లిష్‌లో మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ చెన్నైలో ఉద్యోగం చేయాలి. స్త్రీ, పురుష అభ్యర్థుల వయసు 27 సంవత్సరాల్లోపు ఉండాలి.
- బైజూస్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ట్రైనీగా 50 పోస్టులు ఉన్నాయి. ఏదైనా డిగ్రీ మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరం. వెంటనే ఉద్యోగంలో చేరాలి. ఏపీ, తెలంగాణ, బెంగళూరుల్లో పోస్టింగ్‌లు ఉంటాయి. స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- స్కిల్ క్రాఫ్ట్‌లో ఇంగ్లిష్ అండ్ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ పోస్టులు 20 ఉన్నాయి. ఏదైనా డిగ్రీ, బీటెక్ ఇంగ్లిష్‌లో మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరం. జిల్లాలోనే ఉద్యోగాలు ఉన్నాయి. స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులు.
- ముత్తూట్ ఫైనాన్స్‌లో జేఆర్ఈ, పీఓ, ఇంటర్న్‌షిప్ 25 పోస్టులు ఉన్నాయి. ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ అయి ఉండాలి. నెల్లూరు ప్రకాశం జిల్లాల్లో ఉద్యోగం కేవలం పురుషులకు మాత్రమే.
- జాయాలుకాస్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ట్రైనీస్, ఫ్లోర్ ఆఫీస్ బాయ్ 40 పోస్టులు ఉన్నాయి. ఇంటర్ విద్యార్హత. ఆంధ్ర, తెలంగాణలలో ఎక్కడైనా పనిచేయాలి.
- హెటిరో డ్రగ్స్‌లో జూనియర్ కెమిస్ట్, క్యూఏ, క్యూసీ పోస్టులు 200 ఉన్నాయి. ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, 2017 నుంచి 2021 పాస్ అవుట్స్ మాత్రమే అర్హులు. హైదరాబాదులో ఉద్యోగం, కేవలం పురుషులు మాత్రమే అర్హులు.
- అపోలో ఫార్మసీలో ఫార్మసిస్ట్, ఫార్మసి అసిస్టెంట్ పోస్టులు 10 ఉన్నాయి. విద్యార్హత ఇంటర్ బీ ఫార్మసీ, డీఫార్మసీ. ప్రకాశం, కృష్ణ జిల్లాల్లో పోస్టులు ఉన్నాయి. పురుషులు మాత్రమే అర్హులు.
- ఇసూజు మోటర్ ఇండియాలో నీమ్స్ ట్రైనీస్ 50 పోస్టులు ఉన్నాయి. విద్యార్హత ఇంటర్, ఐటీఐ, బీటెక్ ఏదైనా 2019 నుంచి 2022 పాస్ అవుట్స్ మాత్రమే అర్హులు. శ్రీసిటీలో పనిచేయాలి. స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేయవచ్చు.
- కల్లం టెక్స్‌టైల్స్ మెషిన్ ఆపరేటర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ పోస్టులు ఉన్నాయి. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, ఏదైనా డిగ్రీ ఉన్నవారు అర్హులు. అద్దంకి మండలంలోని కుంకుపాడు వద్ద పని చేయాల్సి ఉంటుంది. స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేయవచ్చు.
- గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్‌లో మిషన్ టెక్నీషియన్స్ పోస్టులు 100 ఉన్నాయి. ఎస్ఎస్‌సీ, ఐటీఐ చదివిన పురుషులు మాత్రమే అర్హులు.
- డిక్సాన్ టెక్నాలజీస్‌లో టీవీ అసెంబ్లింగ్ ఆపరేటర్ పోస్టులు 50 ఉన్నాయి. విద్యార్హత ఎస్ఎస్‌సీ. రేణిగుంటలో పనిచేయాలి. 30 ఏళ్లలోపు స్త్రీ, పురుషులు అర్హులు.
- అమరరాజా బ్యాటరీస్‌లో మెషిన్ ఆపరేటర్స్ ఉద్యోగాలు 300 ఉన్నాయి. ఎస్ఎస్‌సీ ఆపై చదువుకున్న వారు అర్హులు. తిరుపతిలో పనిచేయాల్సి ఉంటుంది. 27 ఏళ్లలోపు పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్‌లో ప్రమోటర్స్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టులు 50 ఉన్నాయి. ఇంటర్, ఏదైనా డిగ్రీ, టూవీలర్ తప్పనిసరిగా ఉండాలి. ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో పనిచేయాలి. 27 ఏళ్లలోపు పురుషులు అర్హులు.
- ఫోన్‌పేలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 10 ఉన్నాయి. విద్యార్హత ఇంటర్, ఏదైనా డిగ్రీ. ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో పనిచేయాలి. 27 ఏళ్లలోపు పురుషులు మాత్రమే అర్హులు.
- మొత్తంగా 1570 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థులు మెగా మేళాకు హాజరు కావాల్సి ఉంది.

రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు ప్రారంభం





ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న వరికూటి అశోక్‌బాబు

సింగరాయకొండ (టంగుటూరు): వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలను వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు శనివారం ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. తొలుత అశోక్‌బాబుకు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు, ఈవో కృష్ణవేణి పూర్ణకుంభం, మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం వరికూటి అశోక్‌బాబు రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. బాపట్ల నుంచి రెండు జట్లు, నంద్యాల, కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి రెండు జట్ల చొప్పున మొత్తం 7 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు, టంగుటూరు మండల జేసీఎస్ కన్వీనర్ చింతపల్లి హరిబాబు, సింగరాయకొండ వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, సర్పంచి వల్లూరి రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ జాన్సీ, యన్నాబత్తిన వెంకటేశ్వరరావు,ఎ సింగరాయకొండ మండల జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, నాయకులు గాలి బుజ్జి, మస్తాను, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టెన్త్ హిందీ పరీక్షకు 268 మంది గైర్హాజరు

ఒంగోలు: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శనివారం నిర్వహించిన పరీక్షకు 268 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 900 మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 632 మంది మాత్రమే హాజరయ్యారు. విద్యాశాఖ అధికారులతోపాటు స్క్వాడ్ బృందాలు 10 సెంటర్లలో తనిఖీలు నిర్వహించాయి. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు.

తైక్వాండోలో ముగ్గురు చిన్నారులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులు

ఒంగోలు: విజయనగరం జిల్లా కొత్తవలసలో శుక్ర, శనివారాల్లో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో ఒంగోలుకు చెందిన ముగ్గురు విద్యార్థులు సత్తాచాటి పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ పోటీలను వరల్డ్ తైక్వాండో, ఇండియా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఏపీ నిర్వహించింది. తైక్వాండో సబ్ జూనియర్, క్యాడెట్ విభాగాల్లో జిల్లా నుంచి మొత్తం 14 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ఒంగోలుకు చెందిన టి.సాహితీ(సబ్‌జూనియర్-గోల్డ్‌మెడల్), రెబ్బవరపు సమీర, షేక్ అబ్దుల్ ఖాదర్ బాషా(క్యాడెట్ విభాగం-కాంస్యం) పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వారిని కోచ్ షేక్ హుస్సేన్‌బాషా అభినందించారు.

వృద్ధాశ్రమాల గుర్తింపునకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు అర్బన్: ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో వృద్ధాశ్రమాలు నిర్వహించే వారు తప్పనిసరిగా వయోవృద్ధుల శాఖ ద్వారా అనుమతి పొందాలని, ఈ మేరకు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ ఏడి అర్చన ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ నిబంధనల మేరకు నెల రోజుల్లో అనుమతి మంజూరు చేస్తామని పేర్కొన్నారు. గుర్తింపు ఉంటేనే వృద్ధాశ్రమాల నిర్వహణకు అనుమతిస్తామని, మిగిలినవి గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్నట్లు పరిగణించాల్సి ఉటుందని స్పష్టం చేశారు. వివరాలకు 08592 281310ను సంప్రదించాలని సూచించారు.

'మీరంతా సంఘంగా ఏర్పడండి.. ప్రభుత్వం నుంచి రాయితీలు, పథకాలు పొందవచ్చు. తద్వారా ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చు' పన్నెండేళ్ల క్రితం పొన్నలూరు మండలంలోని యానాదులకు అధికారులు చెప్పిన మాట ఇది.
ఆ ప్రకారమే 33 మంది జాలర్లు ఓ జట్టుగా ఏర్పడ్డారు. కానీ వారికి దక్కాల్సిన ప్రయోజనం మాత్రం అందలేదు. వారి అమాయకత్వం, నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకున్న ఆ సంఘ అధ్యక్షురాలు ఏటా రూ.లక్షల్లో సంపాదిస్తోంది. ఆమె వ్యవహారశైలిపై అనుమానం వచ్చిన జాలర్లు ఇటీవల ఎదురు తిరిగారు. అధ్యక్షురాలి తీరుపై తీవ్రంగా ఆరోపణలు గుప్పిస్తూ మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో 'ఆడ సొర' అక్రమాల గుట్టు బట్టబయలైంది.



పొన్నలూరు చెరువులో చేపల వేటకు వెళ్లిన జాలర్లను అడ్డుకుంటున్న కోటేశ్వరమ్మ

- నాగిరెడ్డిపాలెం యానాది జాలర్ల సహకార సంఘంలో అవకతవకలు
- పన్నెండేళ్లుగా యానాదులపై పెత్తనం చెలాయిస్తున్న అధ్యక్షురాలు రాపూరి కోటేశ్వరమ్మ
- వారి అమాయకత్వమే పెట్టుబడిగా రూ.లక్షల్లో ధనార్జన
- చేపల వేటకు అడ్డుపడటం, అవినీతి దందాపై అధికారులకు ఫిర్యాదు
- సదరు మహిళకు కొమ్ముకాస్తున్న టీడీపీ ఎమ్మెల్యే స్వామిపై జాలర్ల ఆగ్రహం

చినచేపను పెద చేప!

పొన్నలూరు మండలంలో చేపల చెరువులను చెరబట్టిన 'ఆడ సొర'

పొన్నలూరు: యానాదుల అమాకత్వాన్ని ఆసరాగా చేసుకుని టీడీపీ సానుభూతిపరురాలు రాపూరి కోటేశ్వరమ్మ, ఆమె భర్త రామాంజనేయులు చేపల చెరువుల్లో గలీజు దందా సాగిస్తున్నారు. నాగిరెడ్డిపాలెం పంచాయతీలోని యానాది సంఘానికి చెందిన ఆమె అదే సంఘంలోని మరో నలుగురైదుగురితో కలిసి తోటి సభ్యుల అవకాశాలను కాలరాస్తూ.. వారికి న్యాయంగా దక్కాల్సిన ప్రయోజనాలను తాను పొందుతోంది. వివరాల్లోకి వెళ్తే.. పొన్నలూరు మండలంలోని నాగిరెడ్డిపాలెం, చెరుకూరు, పొన్నలూరు, వెంకుపాలెం, చెన్నిపాడు, శింగరబొట్లపాలెం గ్రామాల్లో నివసిస్తున్న యానాదులు చేపలు పట్టుకుంటూ జీవనాన్ని సాగించేవారు. 12 ఏళ్ల క్రితం మత్స్యశాఖ అధికారులు యానాదుల వృత్తి, జీవన విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంఘంగా ఏర్పడితే ప్రభుత్వ ప్రయోజనాలు పొందవచ్చని వారికి అవగాహన కల్పించడంతో సుమారు 33 మంది యానాది జాలర్లు జట్టుగా ఏర్పడి 'నాగిరెడ్డిపాలెం యానాది సంఘం' పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. సంఘం ద్వారా మండలంలోని పలు చెరువులను లీజుకు తీసుకుని వాటిలో చేప పిల్లలు వేసి పెంచడం ద్వారా ఆర్థికంగా ఎదగవచ్చని యానాదులు భావించారు. కానీ ఆ సంఘానికి అధ్యక్షురాలిగా ఉన్న రాపూరి కోటేశ్వరమ్మ తన భర్తతో పాటు మరో నలుగురిని తోడు చేసుకుని మిగిలిన జాలర్లకు సమాచారం ఇవ్వకుండా రూ.లక్షల విలువైన చేపలను పట్టించి సొమ్ము చేసుకుంటోంది. దీంతో జాలర్ల సంఘంలోని సభ్యులు ఆమె ఆగడాలను అరికట్టాలంటూ మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

ప్రయోజనాలన్నీ ఆమెకే..!

యానాదులు అక్షరాస్యులు కాకపోవడంతో సంఘ కార్యకలాపాలల్లో కోటేశ్వరమ్మ చెప్పిందే చెల్లుబాటుగా మారింది. జాలర్ల సహకార సంఘంలో 33 మంది సభ్యులు ఉన్నప్పటికీ, ఆమె ఆధ్వర్యంలో కేవలం ఐదుగురు మాత్రమే చేపలు పట్టుకుని లాభపడుతున్నారు. మిగిలిన సభ్యులకు చేపల వేటకు సంబంధించి అన్ని రకాల హక్కులు ఉన్నప్పటికీ వారికి అడ్డుతగులుతున్నారు. అలాగే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను ఆమెతో ఉండే వ్యక్తులకు మాత్రమే మంజూరయ్యేలా చేస్తూ మిగిలిన సభ్యులకు మొండిచేయి చూపడం గమనార్హం. యానాది జాలర్లకు ప్రభుత్వం రాయితీపై 20 మోటారుసైకిళ్లను అందించింది. అందులో లబ్ధిదారుని వాటా రూ.6 వేలు కాగా కోటేశ్వరమ్మ మాత్రం ఒక్కొక్కరి నుంచి రూ.20 వేలు వసూలు చేసిందని సభ్యులు ఆరోపించారు. రాయితీపై పంపిణీ చేసిన వలలు, చేపల బాక్స్‌లు, రెండు ఆటోలు కూడా ఆమె ఆధీనంలో ఉన్నాయి.



నిరసన తెలుపుతున్న యానాది జాలర్లు

అప్పు చూపడంతో అవాక్కైన సభ్యులు

యానాది జాలర్ల సహకార సంఘానికి రెండేళ్లకు ఒకసారి చేతులెత్తే పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి. కానీ నిరక్షరాస్యులైన తమతో వేలిముద్రలు వేయించి ఎన్నిక జరిగినట్లు పేపర్లలో చూపిస్తూ పన్నేండేళ్లుగా కోటేశ్వరమ్మ అధ్యక్షురాలిగా కొనసాగుతోందని సభ్యులు వాపోతున్నారు. కరోనా సమయంలో ప్రభుత్వం మంజూరు చేసిన నగదు కూడా తమకు ఇవ్వలేదని సభ్యులు ఆరోపించారు. అయితే కొన్నేళ్లుగా ఆమె ఆగడాలను భరిస్తూ వచ్చిన యానాదులు.. వారిపై అప్పులు ఉన్నట్లు చూపించడంతో అవాక్కయ్యారు. చేపలు పట్టుకోకుండా ఎలా అప్పు ఉంటామని, చేపల వేటకు సంబంధించిన లావాదేవీలు, లెక్కలు చూపాలని ఆమెను నిలదీశారు. సంఘంలో అవకతవకలపై మత్స్యశాఖ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు ఏప్రిల్ 17న ఎస్టీ కాలనీలోని సామాజిక భవనంలో సమావేశం నిర్వహించారు. మత్స్యశాఖ సహాయ సంచాలకురాలు ఉషాకిరణ్‌కు జాలర్ల సంఘంలో అక్రమాలను సభ్యులు క్షుణ్ణంగా వివరించారు. విచారణ పూర్తయ్యే వరకు చెరువుల్లో ఎవరూ చేపలు పట్టరాదని అధికారులు తేల్చిచెప్పారు. దీంతో ఖంగుతిన్న సదరు మహిళ ఎలాగైనా చేపలు పట్టి అమ్ముకోవాలనే ఉద్దేశంతో జాలర్ల సంఘానికి మే 29న చేతులెత్తే పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని అధికారులను కోరింది. ఇందుకు సభ్యులు ససేమిరా అనడంతోపాటు కొత్తగా మరికొందరికి సభ్యత్వం ఇచ్చిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని అధికారులకు విన్నవించారు. దీంతో శాంతిభద్రతల సమస్యగా భావించిన అధికారులు ఎన్నికను నిలుపుదల చేశారు. ఎన్నిక జరిగే వరకు చెరువులపై ప్రత్యేక అధికారికి హక్కులు ఉంటాయని, అప్పటి వరకు మత్స్యశాఖ అధికారుల సూచనల ప్రకారం నడుచుకోవాలని స్పష్టం చేశారు.

అక్రమాలకు ఎమ్మెల్యే స్వామి అండ

వాస్తవంగా నాగిరెడ్డిపాలెం యానాది జాలర్ల సహకారం సంఘం సభ్యులంతా టీడీపీ సానుభూతిపరులే. అయితే మిగిలిన సభ్యులను ఎమ్మెల్యే స్వామి విస్మరించి, కోటేశ్వరమ్మ అక్రమాలకు అండగా నిలిచారు. ఈ అక్రమ సొమ్ములో ఎమ్మెల్యే స్వామికి కూడా వాటా ఉందని బాధిత జాలర్ల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో సదరు మహిళ ఆధిపత్యం, ఆగడాలపై ఎమ్మెల్యే స్వామికి ఫిర్యాదు చేశామని, అయినా సరే మీరు ఆమెకే సహకరించాలని స్వామి బెదిరించినట్లు సభ్యులు వాపోతున్నారు.

కొన్నేళ్లుగా ఆమెదే ఆధిపత్యం



యానాది జాలర్ల సహకారం సంఘం ఏర్పడిన దగ్గర నుంచే కోటేశ్వరమ్మ పెత్తనం చెలాయిస్తోంది. 33 మంది సభ్యుల్లో ఐదుగురు మాత్రమే చెరువుల్లో చేపలు పట్టుకుని అమ్ముకుంటున్నారు. మిగిలిన సభ్యులు చేపలు వేటకు వెళ్తే వారిని అడ్డుకుని గొడవకు దిగుతున్నారు. రాయితీ వస్తువులను కూడా మాకు ఇవ్వలేదు. అవకతవకలపై గతంలో ఎమ్మెల్యే స్వామికి ఫిర్యాదు చేశాం. అయినా మాకు న్యాయం చేయకపోగా, సదరు మహిళ చెప్పినట్లు వినాలని మమ్మల్ని బెదిరించారు. మేము కూడా టీడీపీ సానుభూతిపరులమే అయినప్పటికీ న్యాయం జరగలేదు.

– ఇండ్లా రామాంజనేయులు, సంఘం సభ్యుడు

కొత్త సభ్యులను చేర్చుకున్నాకే ఎన్నిక



జాలర్ల సహకార సంఘంలో అవకతవకలపై విచారణ జరిగే వరకు చేపలు పట్టరాదని అధికారులు తెలిపారు. అందుకే ఎన్నికలు జరిపి కమిటీ ద్వారా చేపలను కాజేయాలని చూస్తున్నారు. కొత్త సభ్యులను చేర్చుకున్న తర్వాతే ఎన్నిక జరపాలి. లేకపోతే అడ్డుకుంటాం. ప్రశ్నిస్తే మమ్మల్ని సంఘం నుంచి తొలగిస్తామని బెదిరించారు. ఇప్పుడు న్యాయం జరుగుతుందనే బయటకు వచ్చాం. ఈ విషయంలో అధికారులు మాకు న్యాయం చేయాలి.

– కొమ్మి సుబ్బారావు, సంఘం సభ్యుడు

అక్రమ దందాలో ఎమ్మెల్యే స్వామికి వాటా



జాలర్ల సహకార సంఘం మాటున సాగుతున్న అక్రమ దందా గురించి ఎమ్మెల్యే స్వామి తెలుసుకుని మాట్లాడాలి. పేదల అమాయకత్వాన్ని పెట్టుబడిగా చేసుకుని చెరువుల్లో చేపలు పట్టి అమ్ముకోవడం, మిగిలిన వారిని పట్టుకోనివ్వకపోవడం దారుణం. అక్రమాలు తేలే వరకు చేపలు పట్టవద్దని మత్స్యశాఖ అధికారులు సూచించారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులకు ఎలాంటి సంబంధం లేదు. స్వామికి ముడుపులు అందాయి కాబట్టే ఒకరికి కొమ్ముకాస్తూ మిగిలిన వారిని బెదిరించారు. బాధితులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది.

– బెజవాడ వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ, పొన్నలూరు

ఎన్‌ఎంఎంఎస్‌కు 203 మంది ఎంపిక

ఒంగోలు: జాతీయ ఉపకార వేతన పరీక్ష(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)లో జిల్లాకు చెందిన 203 మంది విద్యార్థులు సత్తా చాటారని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ పేర్కొన్నారు. పరీక్ష ఫలితాలను శనివారం ఆయన విలేకర్లకు వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఎస్‌సీ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. మెరిట్ కార్డులను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పంపేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం ఎంపికైన విద్యార్థులు వెంటనే ఏదైనా జాతీయ బ్యాంకులో సేవింగ్స్ ఖాతాను తీసుకుని తండ్రి/తల్లిని జాయింట్ చేసుకోవాలని డీఈఓ సూచించారు. విద్యార్థుల ఆధార్ నంబర్‌ను మాత్రమే సంబంధిత అకౌంట్‌కు జతచేయాలని స్పష్టం చేశారు. సేవింగ్స్ అకౌంట్ కాకుండా ఇతర అకౌంట్లు (సుకన్య ఫిక్స్‌డ్ డిపాజిట్లు మొదలైనవి) పనిచేయవని చెప్పారు. విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ వివరాలు మెరిట్ కార్డులో ఉన్న విధంగా ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్‌లో ఒక్క అక్షరం కూడా తేడా లేకుండా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

కేటగిరీల వారీగా ఇలా..

జనరల్ విభాగం-67, జనరల్ ఉమన్-35, ఎస్సీ-20, ఎస్సీ ఉమన్-11, ఎస్టీ-8, ఎస్టీ ఉమన్-4, బీసీఏ-11, బీసీఏ ఉమెన్-4, బీసీ-బి-13, బీసీ-బి ఉమెన్-8, బీసీ-డి 10, బీసీ-డి ఉమన్-4, బీసీ ఈ-6, బీసీ ఈ ఉమన్-ఇద్దరు విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించారు.

గ్రామీణ నీటి సరఫరాకు రూ.135.71 కోట్ల బిల్లులు విడుదల

యర్రగొండపాలెం: ప్రభుత్వం గ్రామీణ నీటి సరఫరాకు రూ.135.71 కోట్ల బిల్లులు విడుదల చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ శనివారం తెలిపారు. పొదిలి సబ్ డివిజన్ పరిధిలో 6,927 పనులకుగాను రూ.134 కోట్లు, ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో 145 పనులకు రూ.1.71 కోట్ల నిధులు మంజూరైనట్లు వివరించారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ల బిల్లులు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తున్నామని, అవసరమైన రికార్డుల తయారీకి అదనపు కంప్యూటర్లు ఏర్పాటు చేసి బిల్లులు ఆన్‌లైన్ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయి అధికారులు బిల్లులు చెల్లింపునకు అవసరమైన రికార్డులు వేగవంతంగా చేస్తున్నారని తెలిపారు. యర్రగొండపాలెంలో డీఈఈ బి.రామకృష్ణ గత రెండు రోజులుగా బిల్లులు అప్‌లోడ్ చేయడంలో నిమగ్నమై ఉన్నారు.

ఆటో బోల్తా

- ఏడుగురికి గాయాలు

యర్రగొండపాలెం: స్థానిక మాచర్ల రోడ్డులోని గురుకుల పాఠశాల సమీపంలో శనివారం ఆటో బోల్తా పడిన సంఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. పుల్లలచెరువు మండలంలోని రాచకొండ గ్రామం నుంచి ప్రయాణికులతో బయలుదేరిన ఆటో గురుకుల పాఠశాల వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. రాచకొండకు చెందిన ఆటో డ్రైవర్ బి.రవికుమార్, చిన్న పీఆర్సీ తండాకు చెందిన నాగఫణీంద్రనాయక్, మహేంద్రనాయక్, శాలిబాయి, యర్రగొండపాలెం మండలంలోని సర్వాయపాలేనికి చెందిన జెస్సీబాబు, జాస్మిని, రాహెల్‌కు గాయాలయ్యాయి. వీరు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. జెస్సీబాబు, జాస్మినికి తీవ్రగాయలు కావడంతో మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు.



International
DELHI PUBLIC SCHOOL
A unit of Delhi Public International School Organization
@ CHERUKUPALLI, Arepalli Road, Ponnapalli, Bapatla Dist.,
9398476247, 7799797931, 7799797932, 7799797933, 7799797936, 7799791200
DAY & RESIDENTIAL
క్రికెట్, వాలీబాల్,పుట్‌బాల్, స్కేటింగ్,
స్విమ్మింగ్ పూల్, హార్స్‌రైడింగ్, షటిల్,
బాడ్మింటన్, టెన్నిస్, బాస్కెట్‌బాల్,
రన్నింగ్ ట్రాక్, జిమ్ వంటి సౌకర్యాలతో
అత్యాధునిక, విశాలమైన క్రీడా ప్రాంగణం
5 STAR FACILITIES తో
రాష్ట్రంలోనే అతిపెద్ద రెసిడెన్షియల్
A/C క్యాంపస్
ADMISSIONS OPEN
A/C Campus
A/C Hostel
A/C Buses
5* FACILITIES
CBSE Curriculum
DAY SCHOLARS : Nursery to X Class
RESIDENTIAL : III to X Class
SPORTS, CULTURAL ACTIVITIES & FACILITIES
IIT FOUNDATION 6-10th
MEDICAL FOUNDATION 6-10th
CIVILS FOUNDATION 8-10th
ఇంటర్నేషనల్
ఢిల్లీ పబ్లిక్ స్కూల్
A unit of Delhi Public International School Organization
@ చెరుకుపల్లి, అరేపల్లిరోడ్, పొన్నపల్లి
9398476247, 7799797931, 7799797932, 7799797933, 7799797936, 7799791200
డే & రెసిడెన్షియల్